ప్రజాశక్తి

శుక్రవారం 14 జూన్ 2024 8 పేజీలు


ప్రకాశం బాపట్ల





హామీల అమలుకు శ్రీకారం

- సిఎంగా బాధ్యతలు చేపట్టాక ఐదు ఫైళ్లపై చంద్రబాబు సంతకాలు..
- మెగా డిఎస్సీపై నిరుద్యోగుల్లో హర్షం
- జిల్లాలో అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభం
- 3,12,313 మంది పెన్షన్‌దారులకు రూ.వెయ్యి పెంపు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే పెట్టిన ఐదు సంతకాలతో ఎన్నికల హామీలు కొన్ని అమలులోకి వచ్చాయి. సచివాలయంలో ఆయన గురువారం బాధ్యతలు తీసుకున్నాక తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపై చేశారు. రెండో సంతకం ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, మూడో సంతకం రూ.4 వేలకు పెన్షన్ పెంపు, నాలుగో సంతకం అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, ఐదో సంతకం నైపుణ్య గణనగా ఉన్నాయి.

ఎన్నికల్లో ఓట్లు పడేందుకు దోహదం చేసిన వాటిపై ఆయన తక్షణం సంతకాలు చేశారు. వాటిని ఆచరణలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. మెగా డీఎస్సీపై నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు డీఎస్సీని ప్రకటించింది. హడావుడిగా 610 పోస్టులను ప్రకటించింది. టెట్ పరీక్ష కూడా నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఇప్పుడు వారంతా ఎదురుచూస్తున్నారు. ఇటీవల చాలా మంది రిటైర్ అయ్యారు. ఖాళీలూ పెరిగాయి. తొలి సంతకం దానిపైనే పెట్టడంతో సంతోషంగా ఉన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. వాస్తవంగా జిల్లాలో జీవో నెంబరు 117తో గత ప్రభుత్వం 362 ప్రాథమిక పాఠశాలలను 256 హైస్కూళ్లలో విలీనం చేసింది. దీని వల్ల చాలా పోస్టులు పోయాయి. విద్యార్థులూ పాఠశాలలకు దూరమయ్యారు. దీనిపై అప్పట్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీల బృందం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలను సందర్శించి పిల్లలు, తల్లిదండ్రులతో మాట్లాడారు. విలీనం వల్ల ప్రాథమిక పాఠశాలలు మూతపడటంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులు కూడా జడ్పీ సమావేశంలోనూ ఆందోళన వ్యక్తం చేశారు. తమకు కూడా చెప్పకుండా పాఠశాలలను మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం జీవో నెంబరు 117ను రద్దు చేస్తే మళ్లీ పోస్టులు పెరుగుతాయి. పాఠశాలలు పునరుద్దరించబడతాయి. దీనిపై ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఇక ల్యాండ్ టైట్లింగు చట్టం రద్దు చేశారు. భూములను సర్వే చేశాక జగన్ బొమ్మతో పాసుపుస్తకాలు ఇచ్చారు. వీటిపైనా రైతులు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. వీటిని రద్దుచేసి కొత్త పుస్తకాలు ఇస్తామని సిఎం చంద్రబాబు చెప్పారు. రైతుల్లో భూములపై ఉన్న ఆందోళన కూడా వీడింది. వైసిపిని ఈ చట్టమే ▶ 2లో



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సమిష్టికృషితో ఎన్నికలు విజయవంతం

కలెక్టర్ దినేష్‌కుమార్

▲ 8లో

భార్యాభర్తలను బలిగొన్న లారీ



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మేదరమెట్ల

భార్యాభర్తలిద్దరినీ లారీ బలిగొంది. ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో భార్యాభర్తలిద్దరూ మృతిచెందిన ఘటన మేదరమెట్ల సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా, రొంపిచర్ల గ్రామం, సుబ్బారెడ్డి కాలనీకి చెందిన

రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

బత్తుల కొండలు (49), బత్తుల లక్ష్మి (41) తమ పెద్ద కుమార్తెకు ఇంకొల్లు మండలం, దుద్దుకూరులోని వ్యక్తితో గతంలో వివాహం చేశారు. ఆ గ్రామంలో గత వారం రోజుల నుండి కొలుపులు ▶ 2లో

భార్యాభర్తలను బలిగొన్న లారీ

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుండటంతో భార్యాభర్తలిద్దరూ నాగులుప్పల పాడులోని బంధువుల ఇంట్లో ఉంటూ రోజూ కొలుపులలో పాల్గొని.. వస్తున్నారు. కొలుపులు బుధవారం అయిపోవడంతో గురువారం ఉదయం స్వగ్రామమైన రొంపిచర్లకు తిరిగి బయలుదేరారు. మేదరమెట్ల సమీపంలో శ్రీ భ్రమరా వెంచర్లలో ఓ లారీ టైల్స్ కొన్ని దించి.. కందుకూరుకు రాంగ్‌రూట్‌లో వెళుతోంది. భార్యాభర్తలిద్దరూ భ్రమరా వెంచర్ సమీపంలోనికి రావటంతో ఆ లారీ వీరిని ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ ఎ.చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హామీల అమలుకు శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

కొంపముంచిందని ఆ పార్టీ నేతలే ఇప్పుడు బహిరంగంగా చెబుతున్నారు. మూడో సంతకంగా వృద్ధులకు పెన్షన్ రూ.4 వేలకు పెంపు. దీని వల్ల జిల్లాలో 3,12,313 మంది లబ్ధిదారులకు ఇప్పుడు వచ్చే సొమ్ముకు అదనంగా నెలకు రూ.1000 పెరుగుతుంది. నెలకు రూ.నాలుగు వేలు రానుంది. నాలుగో సంతకంతో ఐదేళ్ల క్రితం మూసిన అన్నా క్యాంటీన్లు ఇప్పుడు మళ్లీ తెరుచుకోనున్నాయి. ఐదు రూపాయలకే పేదలకు అన్నం దొరుకుతుంది. ఒంగోలులో 5 క్యాంటీన్లు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, దర్శి, చీమకుర్తిలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో క్యాంటీన్లు పెట్టారు. వాటిని వైసిపి ప్రభుత్వం మూసేసింది. చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు వీటిని తిరిగి తెరుస్తున్నారు. విద్యార్థులకు నైపుణ్యం పెంచేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ఐదో సంతకం చేశారు. నైపుణ్యం పెంపు ప్రక్రియ ఉద్యోగాలు పొందేందుకు దోహదపడుతుంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు. దీనిపై సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

ఉపాధ్యాయులుకు తరగతుల వారీగా బాధ్యతలు కేటాయించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుభద్ర తెలిపారు.కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టీలను పరి శీలించారు. అనంతరం హైస్కూల్ ఆవరణలోని పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించి ఎంఇఒలకు తుగు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల నిర్వహణ పట్ల పలు సూచనలు చేశారు. ఎస్ఎంసి మీటింగ్ నిర్వహించి, తల్లి దండ్రుల సమక్షంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఎంఇఒల సమక్షంలో విద్యార్థులు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఎంఇఒ -1 తులసి కుమారి, ఎంఇఒ- 2 పద్మావతి, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, పాల్గొన్నారు.

15న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో కర్నూలు శాంతిరాం ఐ హాస్పిటల్ వారిచే ఈనెల 15న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ముస్లిం మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి మార్కాపురం పట్టణ అధ్యక్షుడు మొగల్ జాబీర్ హుస్సేన్ బేగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి స్థానిక ప్రెస్ క్లబ్ నందులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పశ్చిమ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి ఎం. నిడమనూరు గ్రామానికి చెందిన రైతులు 1,166 బేళ్ళను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,106 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 60 బేళ్ళను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ. 330, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర 278-89 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈకార్యక్రమంలో పొగాకు వ్యాపారులు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా

ప్రజాశక్తి-కురిచేడు

మండల పరిధిలోనిపడమర కాశీపురం గ్రామానికి చెందిన ముక్తిపుడి జెమిమ కిరణ్ దర్శి ఎఎంసి డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. గంగదొనకొండ గ్రామానికి చెందిన కండే గంగయ్య దర్శి ఎఎంసి వైస్ చైర్మన్‌గా పని చేయుచున్నారు. గురువారం వారు తమ పదవులకు రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడంతో వారు తమ పదువులకు రాజీనామా చేశారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

కొండమ్మకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి మండల ఉపాధ్యక్షుడు సవలంకోటేశ్వరరావు తల్లి సవలం కొండమ్మ ప్రథమ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని కొండమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాలనీకి చెందిన యువకులు ఎమ్మెల్యే విజయం సాధించిన చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ షేక్ లియాఖత్, షేక్‌పటేల్, షేక్‌కరీం పాల్గొన్నారు.

నీటి సరఫరా తనిఖీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పట్టణంలో నెలకొన్న నీటి సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. ఈ క్రమంలో స్థానిక ఎబిఎం పాలెంలో నీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్లను ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ మురళి,ఎఇ భ్రమరాంబిక గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్యాంకర్ల వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలతో మాట్లాడారు. నీటి సమస్యపై ఆరా తీశారు. నీరు సక్రమంగా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉదయాన్నే నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలకు కోరారు. ఈ సందర్భంగా ఇఇ మురళి మాట్లాడుతూ త్రీ ఫేస్ కరెంట్ పగలు ఉంటున్నందున ఉదయాన్నే నీటి సరఫరా సాధ్యం కాదన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని విత్తన దుకాణాలను దర్శి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె. బాలాజీ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేకుండా వివిధ విత్తన దుకాణాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రూ. ఐదు లక్షల విలువైన విత్తన విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ విత్తన దుకాణ దారులు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థాని ఎఒ కెవి.శేషారెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గౌరవవేతనం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి- పిసిపల్లి

2024 సాధారణ ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన తమకు గౌరవ వేతనాన్ని ఇవ్వలేదని బూతు లెవల్ ఆఫీసర్లు ఆందోళన చేపట్టారు. మే 13న ఎన్నికల సందర్భంగా 12, 13 తేదీల్లో వారు ఎన్నికల బూత్ వద్ద విధులు నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చే అధికారులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. భోజన మరియు వసతి సౌకర్యాలు కూడా వీరే కల్పించారు. వీరికి ఒక్కొక్కరికీ ప్రభుత్వం రూ.2,000 గౌరవ వేతనం ఇవ్వాలని ఆదేశించింది. పంచాయతీ కార్యదర్శులు, నామమాత్రం వేతనంతో పనిచేసే అంగన్‌వాడీలు బూతు లెవల్ అధికారులుగా విధులు నిర్వహించారు. వీరు రెండు రోజులు పాటు మండుటెండలో విధులు నిర్వహించారు. రాత్రిపూట విధులు నిర్వహించారు. అయినప్పటికీ నామమాత్రంగా ఇచ్చే గౌరవ వేతనం కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా గౌరవ వేతనం కోసం ఎదురు చూస్తున్నట్లు వారు తెలిపారు. మండలంలో మొత్తం 39 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 39 మంది బిఎల్‌ఎలు ఎన్నికల విధులు నిర్వహించారు. అందుకు గాను వారికి రూ. 78,000 చెల్లించాల్సిఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు గౌరవవేతనం ఇవ్వాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి నాగులుప్పలపాడు



ఎంఇఒలకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మధ్యాహ్నభోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒలు రవి, రమణయ్యకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు జి.బసవపున్నయ్య మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. రోజుకో రకం వంట తయారు చేసి పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రోజు రాగిజావ కాయాలని నిబంధనలు పెట్టినట్లు తెలిపారు. నిత్యావసరాలు ,కూరగాయలు, గ్యాస్ ధరలు పెరుగడంతో కార్మికులపై భారం పడుతుందన్నారు. ఓ ప్రక్క ధరల పెరుగుదల, మరో ప్రక్క పనిభారం పడటంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు.నూతన ప్రభుత్వమైన స్పందించి మెనూ ఛార్జీ రూ. 20 రూపాయలకు పెంచాలన్నారు. కార్మికులు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, కనీసవేతనం అమలు చేయాలన్నారు. ప్రతినెలా 5లోపు వేతనాలు చెల్లించాలన్నారు. గ్యాస్ సిలిండర్ల ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. యూనిఫాం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కమిటీ సభ్యులు హనుమంతరావు, మాధవి,వెంకటేశ్వరమ్మ, వెంకటరమణ,వెంకటేశ్వరమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సభ్యుల సమావేశం

ప్రజాశక్తి-దర్శి



మాట్లాడుతున్న నగరపంచాయతీ చైర్మన్

దర్శి నగర పంచాయతీకి ఏడాదికి నాలుగు కోట్ల రూపాయల పన్నుల రూపంలో ఆదాయంగా సమకూరుతున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నారపుశెట్టి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ నగర పంచాయతీకి పన్నుల రూపంలో నాలుగు కోట్ల ఆదాయం సమకూరుతున్నట్లు తెలిపారు. అందులో మూడు కోట్లు ఉద్యోగల జీతాలు ఖర్చు అవుతున్నట్లు తెలిపారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు కోసం రూ.121 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అందులో రూ.7 కోట్లు దర్శి నగర పంచాయతీ చెల్లించాల్సి ఉందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం సమీపంలో స్థలాన్ని పరిశీలించి ఆమోదం పొందిన తర్వాత నగర పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. కౌన్సిల్ అజెండాను గురించి కమిషనర్ మహేశ్వరరావు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు గన్నెపూడి స్టీవెన్, తలారి కోటయ్య, డిఇ రహీం, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -సిఎస్ పురంరూరల్

ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు పరిష్కరించే దిశగా నూతన ప్రభుత్వం కృషి ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ కోరారు. ఎపిటిఎఫ్ మండల సమావేశం గురువారం నిర్వహించారు. తొలుత నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 117 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగించాలన్నారు. ప్రతి హై స్కూల్‌కు ప్రధానోపాధ్యాయుడి పోస్ట్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ మండల నాయకులు సుబ్బరాయుడు, పి.మాలకొండయ్య, కె.రామసుబ్బారావు, బత్తుల రవీంద్ర, చెన్నయ్య,రామకృష్ణ,శ్రీనివాసులు, రఫీ, పుల్లయ్య, చిన్న నారాయణ, సునీతా దేవి, గాంధీ, ఇండ్ల ప్రసాద్, శ్రీహరి, హమ్మద్, రవీంద్ర, మల్లికార్జున రాజు తదితరులు పాల్గొన్నారు.

యువతను జగన్ మోసం చేశారు

ప్రజాశక్తి-పొదిలి

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాయ మాటలు చెప్పి యువతను మోసం చేశారని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం పెట్టినట్లు టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి గౌస్ బాషా తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువతకు ఉద్యోగాలు, ఉపాధి కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకులు ఇచ్చిన హామీ మేర మెగా డిఎస్సిపై సంతకం పెట్టినట్లు తెలిపారు. మెగా డిఎస్‌సిపై సంతకం పెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబుకు ఈ సందర్భంగా గౌస్‌బాషా ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి స్వామికి సత్కారం

టంగుటూరు : మండల పరిధిలోని కొణిజేడు గ్రామానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రామా గోపి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యను గురువారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి, దామచర్ల సత్యకు శాలువా కప్పి గజ పూలమాలతో సత్కరించారు.

విద్యాకిట్లు అందజేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఎంఇఒ మస్తాన్ నాయక్ ఆధ్వర్యంలో విద్యా కిట్లు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా కిట్లను సకాలంలో అందజేయాలన్నారు. విద్యాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కొండలరావు, ప్రధానోపా ధ్యాయులు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్ మృతి

ప్రజాశక్తి-మార్కాపురం



దూదేకుల ప్రసాద్ (ఫైల్)

మార్కాపురం మున్సిపాలిటీ 23వ కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్ (58) బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యేలు అన్నా వెంకటరాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి సంతాపం ప్రకటించారు. ప్రసాద్ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. శ్రద్ధాంజలి ఘటించిన వారిలో మున్సిపల్ చైర్పర్సన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాస్,కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైసిపి నాయకులు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

రైలు దిగబోయి ప్రమాదవశాత్తు పడిపోయిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఈ ఘటన భట్టిప్రోలు వద్ద గురువారం చోటు చేసుకుంది. రేపల్లె నుంచి గుంటూరు వెళ్లే రైలులో భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన భీమవరపు శ్రీనివాసరావు(44) ఎక్కాడు. రైలు భట్టిప్రోలు రైల్వే స్టేషన్ వస్తున్న క్రమంలో ప్లాట్‌ఫాం రాకముందే దిగేందుకు ప్రయత్నించాడు. దీంతో ప్రమాదశాత్తు జారి ముందుకు పడిపోయాడు. దీంతో శ్రీనివాసరావు తలకు బలమైన గాయం కావడంతో ఆయన అక్కడ అక్కడే మతి చెందాడు. మతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె వైద్యశాలకు తరలించారు.

పూరిగుడిసె దగ్ధం

ప్రజాశక్తి - రాచర్ల

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఓ పూరి గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని ఆకవీడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటన గ్రామానికి మరియమ్మ పూరిగుడిసె అగ్నికి ఆహుతి అయిపోయింది.ఇంట్లో దాచుకున్న నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతి అయ్యాయి.

గ్రంథాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె రికార్డులు పరిశీలించారు. సభ్యత్వాలు పెంచాలని, సెస్సు మరియు స్థల సేకరణ కోసం కృషి చేయాలని స్థానిక గ్రంథాలయ పాలకుడు అజయ్ బాబుకు సూచించారు. సమ్మర్ క్యాంపులో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థుల ప్రతిభను మెచ్చుకొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు సిహెచ్.అజయ్ బాబు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి- కొత్తపట్నం

కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫేస్–2 కింద చేపట్టిన నాడు- నేడు పనులు డిఇఒ సుభద్ర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పూర్తయిన గదులలో తరగతులు నిర్వహించాలని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవిని ఆదేశించారు. ఏడు ఎసిఆర్ గదులకు గాను రెండు గదులకు మాత్రమే కిటికీలు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. మిలిగిన గదుల్లో కిటికీలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని గదులకు తలుపులు బిగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్‌బాబు, ఎంఇఒ పద్మావతి, ఇన్‌ఛార్జి ప్రధానో పాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు, ఎఇ రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి లింగేశ్వరరెడ్డి

ఆర్‌జెడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - యద్దనపూడి

గుంటూరు ఆర్‌జెడి బి లింగేశ్వరరెడ్డి స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల కిట్ల పంపిణీని పరిశీలించారు. చివరి కిట్టు వరకు త్వరిత గతిన పంపిణీ చేయాలని చూచించారు. ప్రణాళిక ప్రకారం కిట్ల పంపిణీ చేస్తుండటం పట్ల ఎంఇఒ గోపిని అభినందించారు. బోధనలో ఐఎఫ్‌పి ప్యానెళ్లను ఉపయోగించాలని చెప్పారు. అప్పుడు విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో పర్చూరు డిప్యూటి డిఇఒ నిర్మలాదేవి, హెచ్‌ఎం దేవేంద్రరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రావి శ్రీనివాసరావు, జీవన్, మస్తాన్‌వలి, యూసుఫ్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



వైద్యశాలకు గోడ గడియారం బహుకరిస్తున్న శ్రీనివాసరావు

ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీ సేవలు

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ఆసుపత్రికి ఉపయోగపడే గోడ గడియారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యశాల్లోని రోగులు, బాలింతలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని అన్నారు. సిబ్బందికి డ్రెస్ కోడ్ కలిగిన బట్టలు ఇవ్వనున్నట్లు తెలిపారు. డాక్టర్లు సౌమ్య, ముగ్ధం అలీ మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోమటి ఆంజనేయులు, తోకల కృష్ణ మోహన్, అడ్డగడ శివరామకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు నాసిక వీరబద్రయ్య

టిడిపి శ్రేణుల విజయోత్సాహం

ప్రజాశక్తి - వేటపాలెం

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని దేశాయిపేటలో కేక్ కటింగ్ చేసి, స్వీట్స్ పంచి టిడిపి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య, చింతా రామకృష్ణారావు, వెంగళ భరత్ బాబు, మాచర్ల సాంబశివరావు, పేరిసెట్ల శ్రీహరి, సజ్జ లెనిన్ బాబు, కొవ్వూరి శివారెడ్డి, నిమ్మని వెంకట పిచ్చయ్య, బుర్ర కవిత, సజ్జ వెంకట సుబ్బారావు, నాసక కోటేశ్వరరావు, సజ్జ చంద్రబాబు, భూసం శివ, పింజల బాలచంద్ర, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్‌ను మండలంలోని కళ్ళంవారిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు గురువారం ఉదయం చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఐదుసార్లు శాసన సభ్యునిగా వరుసగా విజయాలు సాధించి అద్దంకి చరిత్రలోనే మంత్రి పదవిని పొందిన ఏకైక వ్యక్తి గొట్టిపాటి రవికుమార్ అని అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి, కల్లంవారి పాలెం టిడిపి అధ్యక్షులు గుదిబండ్ల చిన్న ఆదిరెడ్డి, భవనం సిద్ధారెడ్డి, గుడిపాటి సుబ్బారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు భవనం వెంకటరామిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు వలేరు చిన్ననాగయ్య, సురేంద్రబాబు, భవనం ఆదిరెడ్డి, జొన్నల హరిబాబురెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, వెంకట నాగిరెడ్డి, భవనం శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



మంత్రి గొట్టిపాటిని కలిసిన కల్లంవారిపాలెం నాయకులు

గొట్టిపాటి హనుమంతరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - యద్దనపూడి

మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు, మాజీ ఎంఎల్ఎ గొట్టిపాటి నరసయ్య విగ్రహాలకు రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఘనంగా నివాళి అర్పించారు. తన సొంత గ్రామమైన యద్దనపూడిలో మంత్రి రవికుమార్ గురువారం పర్యటించారు. తొలుత తన పెద్దనాన్న, తండ్రి స్మృతి వనం వద్ద పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలోని ఎన్‌టిఆర్, స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు, గొట్టిపాటి నరసయ్య విగ్రహాలకు పూల మాలలు వేసి వివాళి అర్పించారు. మంత్రిగా తొలిసారి గ్రామానికి వచ్చిన రవి కుమార్‌ను పలువురు గ్రామ, మండల నాయకులు కలసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రావిపాటి సీతయ్య, పెరవలి శ్రీను, వజ్జా సుబ్బయ్య, గొట్టిపాటి వెంకటరావు, సర్పంచ్ రేణుకా బాలకోటేశ్వరరావు, గుదే తారక, యావల సాంబయ్య, గన్నవరం ఎంపిటిసి జి సతీష్ పాల్గొన్నారు. ఎస్ఐ జివి చౌదరి తన సిబ్బందితో బాదోబస్తు నిర్వహించారు.



హనుమంతరావుకు నివాళి అర్పిస్తున్న మంత్రి రవికుమార్

విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - నగరం

స్థానిక వ్యవసాయ కార్యాలయం నందు ఖరీఫ్ సాగు సమాయత్వంపై వ్యవసాయ గ్రామ సహాయకులు, విస్తరణాధికారులకు, విత్తన, ఎరువులు, పురుగు మందుల షాపు డీలర్లతో గురువారం ఎఒ వి రమేష్ బాబు అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో రేపల్లె ఎడిఎ సత్తార్ హుస్సేన్ మాట్లాడుతూ వర్షాలు కురిసి అనుకూల వాతావరణంలో సాగుకు సిద్ధమవుతున్న రైతులకు విత్తనాలు ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు గ్రామస్థాయిలో రైతులకు విత్తనాల ఎంపిక గురించి వివరించాలని సూచించారు. భూసార పరీక్షలు కొరకు ఎంపిక చేసుకుని మట్టి నమూనాలు స్వీకరించాలని చెప్పారు. మండలానికి ఇచ్చిన టార్గెట్ ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు. విత్తనాలు కొనే ప్రతి రైతు లైసెన్స్ డీలర్ వద్ద కొనుగోలు చేసి రసీదు పొందాలని సూచించారు. బాపట్ల డిఆర్సి నుండి మండల వ్యవసాయ అధికారి ఆర్ విజయ్ బాబు మాట్లాడుతూ మన ప్రాంతానికి అనుకూలమైన వరి వంగడాలను ఎంపీ చేసుకోవాలని చెప్పారు. అందుబాటులో ఉన్న బిపిటి 52-04, ఎంటియు 12-24, ఎంపీలు 10-61 ఎంపీలు 11-21 ఎన్‌ఎల్‌ఆర్ 34-49 ఆర్‌ఎన్ఆర్ 15-0-48 ఎంసిఎం 100ఈ వీటిని ఉపయోగించుకోవడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఎఒ వి రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ రైతులకు సరైన సూచనలు అందజేసి ఖర్చు తగ్గించి దిగుబడి పెరిగేలా కృషి చేయాలని తెలిపారు. కొనుగోలు చేసే ప్రతి రైతుకు తగిన రసీదు ఇవ్వాలని చెప్పారు. స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్ పెట్టుకొని వ్యాపారం చేయాలని సూచించారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వం అధికారి కె నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కర్లపాలెం : మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులతో వ్యవసాయ కార్యాలయం నందు ఈఖరీఫ్ సీజన్లో వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి పాటించాల్సిన అంశాలపై డీలర్లకు ఎడిఎ లక్ష్మి సూచనలు ఇచ్చారు. నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు మాత్రమే విక్రయించాలని చెప్పారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని అన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఖచితమైన ధరలకే విక్రయించాలని తెలిపారు. ప్రభుత్వ నియమాలను ఉల్లంగించంచిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలను విక్రయించడానికి ముందు వాటి మొలక శాతం బట్టి, మొలక శాతం 90శాతంకు మించి ఉంటేనే అమ్మాలని సూచించారు. డిడిఎ విజయ నిర్మల గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పచ్చిరొట్ట పైరు ప్రాముఖ్యతను గురించి రైలకు తెలిపారు. వారి నేలల్లో సేంద్రియ కార్బనం పెంపొందించుకునేల రైతులకు దోహద పడాలని తెలిపారు. రాబోవు ఖరీఫ్ సీజన్లో పంట నమోదు చేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి వివరించారు. ఏరువాక కేంద్రంలో శాస్త్రవేత్త ఉష వరిసాగుకు సంబంధించిన మెలుకువలపై గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులైన సుమంత్ కుమార్, జయశ్రీ, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడిఎ సత్తార్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ లక్ష్మి



నివాళులర్పిస్తున్న నరేంద్ర వర్మ

చందోలు మాజీ సర్పంచ్ సుల్తానా బేగం మృతి

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపి పిట్టలవానిపాలెం మండల అధ్యక్షులు అఫ్జల్ సతీమణి, చందోలు మాజీ సర్పంచి సుల్తానా బేగం గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుల్తానా బేగం మృతి పట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ తీవ్ర సంతాపం తెలిపారు. సుల్తానా బేగం అంత్యక్రియలకు నరేంద్ర వర్మ హాజరయ్యారు. ఆఫ్జల్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అతని కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని అన్నారు.



మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఒ విజయమ్మ

కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ తరగతులు బాపట్ల, చీరాల ఏరియా వైద్యశాలల్లో ఈనెల 13నుండి జూలై 6 వరకు నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య జిల్లా అధికారి ఎస్ విజయమ్మ తెలిపారు. శిక్షణ తరగతులపై వైద్య ఆరోగ్య సిబ్బందితో జిల్లా కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరు బ్యాచ్‌లకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి బ్యాచ్ కు ఈనెల 13 నుండి 15 వరకు శిక్షణ ఇస్తారు. జిల్లాలో వైద్యాధికారులు, వెల్ నెస్ సెంటర్స్ లో పనిచేసే మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పట్టణ ప్రాంతాల్లో పనిచేసే ఏఎన్‌ఎం లకు ఈ శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణా తరగతులకు మెడికల్ కళాశాల విభాగం నోడల్ అధికారి బి. తిరుమల రావు కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తారన్నారు. శిక్షణ తరగతులను ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. తొలి రోజు శిక్షణ తరగతులను రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ ఫర్ అర్బన్ హెల్త్ సెంటర్స్ విజయలక్ష్మితో కలసి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్. ఎస్. విజయమ్మ ప్రారంభించారు. సమావేశంలో జిల్లా వైద్యశాలల సమన్వయ అధికారి ఏ.వి. శేషు కుమార్ , బాపట్ల జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి. వెంకటేశ్వర్లు , జిల్లా ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ఎం. సౌజన్య పాల్గొన్నారు.



ఎంఎల్ఎ కొండయ్యను కలిసిన గ్రామస్థులు

కొండయ్యకు సత్కారం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవు, కీర్తివారిపాలెం గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు పిన్నిబోయిన రామకృష్ణ, డాక్టర్ సైకం చంద్ర ఆధ్వర్యంలో శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్యను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కలగానే రహదారి నిర్మాణం..

- తరచూ మరమ్మతులతో మమ అనిపిస్తున్న అధికారులు



దెబ్బతిన్న ముటుకుల రహదారి

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు నుంచి యర్రగొండపాలెంకు రెండు వరసల రహదారి నిర్మాణం ఐదేళ్లుగా కలగానే మిగిలింది. ఉన్న రహదారి మరమ్మతులకు నోచుకోక పోవడంతో ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. గత 13 ఏళ్లుగా ఈ రహదారి కనీసం శాశ్వత మరమ్మతులకు కూడా నోచుకోలేదు. గత ఏడాది మాత్రం ఒకసారి కొద్దిదూరం రోడ్డుకు మరమ్మతులు చేసి అధికారులు మమ అనిపించారు. ఐదేళ్ల క్రితం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆదిమూలపు సురేష్ నూతన రోడ్డు నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వంపై ఈ ప్రాంత ప్రజలు గంపెడు ఆశలు పెట్టుకొని ఉన్నారు. రెండు వరసల రహదారి నిర్మిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం సింగిల్ రోడ్లు కూడా నిర్మించకుండా రూ.10 లక్షలతో సూమారు 0.7 కిమీ రోడ్డును బీటీతో మరమ్మతులు చేశారు.

వైపాలెం నుంచి పుల్లలచెరువు వెళ్లాలంటే..

యర్రగొండపాలెం నియోజకవర్గం కేంద్రం నుంచి పుల్లలచెరువు మండల కేంద్రానికి మధ్య 19 కిమీ దూరం ఉంది. ప్రధానమైన రోడ్డును నిర్మించకుండా గత ప్రభుత్వ హయాంలో మరమ్మతుల పేరుతో నిధులను దుర్వినియోగం చేశారు. ప్రధానంగా చాపలమడుగు-పుల్లలచెరువు మధ్యలో ఉన్న రోడ్డులో ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన పడుతూన్నారు. చాపలమడుగు నుంచి పుల్లలచెరువు వరకు సుమారు 9 కిలోమీటర్లు రోడ్లు గుంతల మయంగా మారింది. తారు లేచి పోయింది. పంచాయతీరాజ్ పరిధిలోని ఈ రోడ్డు గత 10 సంవత్సరాలకు పైగా మరమత్మలకు నోచలేదు. 2017లో ఆర్అండ్బి పరిధిలోకి వెళ్లింది. ఈ రోడ్డుపై నిత్యం ప్రయాణించే ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పుల్లలచెరువు మండలంలోని కొమరోలు నుంచి కుందంపల్లి, రంగన్నపాలెం వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు ఐదు కిలోమీటర్ల పొడవున గుంతలు ఏర్పడ్డాయి. చిల్ల చెట్లతో మూసుకు పోయింది. దీంతో కందపల్లి-కొమరోలు గ్రామ ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముటుకుల-మానేపల్లి వరకు ఉన్న తారు రోడ్లు తారు పూర్తిగా లేచిపోయింది. గుంతలతో ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పుల్లలచెరువు పంచాయతీలోని చెన్నపాలెం గిరిజన గూడెంకు రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ప్రతి రోజు నిత్యవసర సరుకులు, పింఛన్లు, వైద్య సేవలకు ఎనిమిది కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

చందాలతో మరమత్మలు

పుల్లలచెరువు-వినుకొండకు వెళ్లే ప్రధాన ఆర్అండ్బి రహదారి కూడా ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. నిత్యం ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ముటుకుల పంచాయతీలోని తెల్లగట్ల వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అధికారులకు, నేతలకు అనేక సార్లు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులే చందాలు వేసుకొని గతంలో రోడ్డుకు గ్రావెల్ పోయించారు. ఈ రహదారిని 1995వ సంవత్సరంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా రూ.40 లక్షలతో పుల్లలచెరువు-ముటుకుల మధ్య నిర్మించారు. బీటీ రోడ్డుతో పాటు మధ్యలో ఉండే తెల్లగట్ల వద్ద సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే ఈ రోడ్డు పంచాయతీ రాజ్ పరిధిలో ఉన్న సమయంలో ఒకటి సార్లు మరమ్మతులు చేశారు. 2016లోఅర్అండ్బి పరిధిలోకి చేర్చారు. అప్పటి నుంచి కనీసం మరమ్మతులకు కూడా నోచలేదు. దీంతో గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనైనా యర్రగొండపాలెం-పుల్లలచెరువు ప్రధాన రహదారిని రెండు వరుసల రహదారిగా మార్చి గ్రామీణ ప్రాంత రోడ్లకు మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గతుకుల రోడ్డుతో అవస్థలు పడుతున్నాం

జినుకూటి రాజీవ్ గాంధీ, నాయుడుపాలెం



యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు వెళ్లే రహదారి గతుకుల మయంగా మారింది. ఎప్పుడో నిర్మించిన ఆ రోడ్డుకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. నాయుడుపాలెం నుంచి 10 కిమీ దూరంలో ఉన్న యర్రగొండపాలెం రావాలంటేనే అరగంట పడుతుంది. వృద్ధులు, గర్భిణులు ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెండు వరుసల రోడ్డు నిర్మించాలి

ఆదిమూలపు కొండయ్య, నాయుడుపాలెం



పుల్లలచెరువు నుంచి యర్రగొండపాలెం మార్గంలో నిత్యం ఐదు వేల మంది వివిధ వాహనాల ద్వారా ప్రయాణిస్తుంటారు. రహదారి మరమ్మతులకు నోచుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. ఫలితంగా ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. రెండు వరుసల రోడ్డు నిర్మించి ఆదుకోవాలి.

ఉపాధి పనులు పునరుద్ధరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

సార్వత్రిక ఎన్నికలు, మరియు వర్షాల కారణంగా నిలిచిపోయిన ఉపాధి పనులను తిరిగి ప్రారంభించాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కె.లలితకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత కొంతకాలంగా ఉపాధి పనులు గ్రామీణ ప్రాంతాలలో కూలీలకు రైతులకు కొంత చేదోడు.వాదోడుగా నిలిచినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనేక గ్రామాలలో పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారం అయినందున వెంటనే ఉపాధి పనులు ప్రారంభించి కూలీలను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత మూడు వారాలుగా బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, పెడింగ్ బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కూలీలకు 200 పనిదినాలు కల్పించి రోజు వారీ కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. 30 రోజులు పని చేసిన ప్రతి జాబ్ కార్డుదారులకు పనిముట్లు పంపిణీ చేయాలన్నారు. మెడికల్ కిట్లు పంపిణీ చేయాలన్నారు. పని ప్రదేశంలో చనిపోయిన కూలీలకు రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలన్నారు. ఉపాధి చట్టానికి కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. పని కావాలని కోరిన దరఖాస్తుదారునికి పని కల్పించుకుంటే నిరుద్యోగ భతిని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీల సంఘం నాయకులు కత్తి మత్తయ్య, వినయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




కొండపిలో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కొండపి : వర్షాలు, ఇతర కారణాల రీత్యా నిలిచి పోయిన ఉపాధి పనులను వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి. మస్తాన్ కోరారు. ఉపాధి పనులను ప్రారంభించాలని కోరుతూ ఎంపిడిఒ నాగమణి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ తక్షణమే ఉపాధి పనులను ప్రారంభించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పని ప్రదేశంలో మరణించిన కూలీకి రూ. 10లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పారాబత్తిన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



మంత్రులతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గిద్దలూరు

రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌ను విజయవాడ లోని తాడేపల్లిలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

మంత్రి స్వామికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని,టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, టిడిపి సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావును ప్రకాశం జిల్లా పూర్వ కలెక్టర్ బి.ఉదయలక్ష్మీ, ఆమె భర్త మాజీ ఐపిఎస్ అధికారి బి.రమణ కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణను మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దామచర్ల సత్య కలిసి సన్మానించారు.



మంత్రి పవన్ కల్యాణ్‌తో సాధిక్

పవన్ కల్యాణ్‌కు కలిసిన సాధిక్

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

జనసేన పార్టీ అధినేత, మంత్రి పవన్ కళ్యాణ్‌ను జనసేన పార్టీ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్ మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పార్టీ అభివద్ధి కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్త కష్టాన్ని పార్టీ ఎప్పటికీ మరువదని తెలిపారు. కష్టకాలంలో పార్టీకు అండదండగా నిలిచిన జనసేన కార్యకరలు, వీర మహిళలకు పవన్ కల్యాణ్ కతజ్ఞతలు తెలిపినట్లు సాధిక్ తెలిపారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశాన్ని ఆదుకోవాలని, మార్కాపురం జిల్లా త్వరత గతిన ఏర్పాటు చేసి పశ్చిమ ప్రకాశం అభివద్ధికి సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని సాధిక్ ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ను కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన పవన్ కళ్యాణ్ తమ కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సాధిక్ తెలిపారు.

జగనన్న కాలనీ సరే..విఠలేశ్వరనగర్ సంగతేంటి?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత ప్రభుత్వం నిరుపేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేసి కనీసం మౌలిక వసతులు ఏర్పాటు చేయకుండా పాలన కొనసాగించడంతో ప్రజల ఆగ్రహానికి గురై ఓటమిపాలైంది. మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్న కాలనీ పేరుతో భూముల్లో నివేశన స్థలాలు కేటాయించారు. అందుకు అవసరమైన రహదారుల నిర్మాణం, మేరకలు చేపట్టకపోవడంతో స్థలాలు ఉన్నప్పటికీ గృహాలు నిర్మించుకునేందుకు అవకాశం లేక నిరుపయోగం అయ్యాయి. అదే రీతిలో గత 25ఏళ్ల క్రితం ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో నిరుపేదలకు కేటాయించిన భట్టిప్రోలు విఠలేశ్వర నగర్ కాలనీ, ఓలేరు వెంకటరాజు నగర్ కాలనీలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం లేక కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్న సంఘటనలు ఉన్నాయి. భట్టిప్రోలు విట్టాలేశ్వర నగర్ కాలనీలో 7 ఎకరాల్లో ఆనాడు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. 15ఏళ్ల పాటు ఈ ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం లేక నిరుపయోగంగా మారాయి. దీంతో గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆనాటి ప్రభుత్వం మేరకలు తోలించింది. దీంతో కొంతమంది లబ్ధిదారులు నానా అవస్థలు పడుతూ అక్కడక్కడ కొంతమంది గృహ నిర్మాణాలు చేపట్టేందుకు పూనుకున్నారు. ఇక్కడ పరిస్థితిని గుర్తించిన ఆనాటి శాసన



అస్తవ్యస్తంగా విఠలేశ్వర్ నగర్ కాలనీలో రహదారి

సభ్యులు నక్కా ఆనందబాబు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో ఈ కాలనీలో సిసి రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలనీలోని అన్ని రహదారులను సిసి రహదారులుగా మార్చేందుకు అవసరమైన కే వాల్ నిర్మాణం చేపట్టి దానిలో డస్ట్‌ను నింపారు. ఆ సమయంలో కాలనీలో నాలుగైదు రహదారులను ఎలాంటి కే వాల్ లేకుండా ఆనాటి అధికారులు వదిలేశారు. అయినప్పటికీ కే వాల్ పూర్తి చేసిన రహదారులు కూడా సిమెంట్ రోడ్ నిర్మాణానికి నోచుకోలేదు. అదే సమయంలో ఎన్నికలు సమీపించటంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ కేవాల్ నిర్మాణాలతో రహదారులు ఏర్పడ తాయనే భావనతో లబ్ధిదారులు ఒక్కొక్కరిగా గృహ నిర్మాణాలు చేపట్టారు. కానీ ప్రభుత్వం మారడంతో ఈ రహదారుల దుస్థితి అర్ధాంతరంగా ఆగిపోయింది.

లోతట్టు ప్రాంతం కావడంతో నిత్యం వర్షపునీరు

ఈ కాలనీ లోతట్టు ప్రాంతం కావడంతో కొద్దిపాటి వర్షానికి గ్రామంలోని వర్షం నీరు మొత్తం కాలనీ ప్రక్కనున్న చెరువులోకి చేరుతుంది. చెరువు ఎగతట్టి కాలనీలో మోకాలి లోతుపైగా నీరు నిలబడుతుంది. సిసి రహదారి నిర్మాణం లేకపోవడంతో కేవాల్ వేసిన రహదారిపై కూడా నెలలు తరబడి నీరు నిలబడి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాక నిత్యం కాలనీలో నీరు చుట్టుముడుతుంది. దీంతో దోమలు వృద్ధి చెంది ఆకులు, అలములు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. పాములు గృహాల్లోకి వెళుతూ ఉండటంతో కాలనీ ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన దుస్థితి నెలకొని ఉంది. కే వాల్ నిర్మాణం చేపట్టని రహదారులైతే మరింత ఘోరంగా ఉంది. మూడు అడుగులకుపైగా నీటితో నిండి ఉంటాయి. గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం కాక కనీసం పంచాయతీ అధికారులు కూడా కాలనీ రహదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఐదేళ్ల కాలనీ వాసులు నీటితోనే కాలక్షేపం చేశామని ఇప్పటికైనా నూతన ప్రభుత్వ పాలనలో అర్ధాంతరంగా ఆగిపోయిన రహదారులను పూర్తి చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఎఎస్ఐ బ్రహ్మయ్యకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - చెరుకుపల్లి



ఎస్ఐగా పదోన్నతి పొందిన ఎం బ్రహ్మయ్య

స్థానిక పోలీసు స్టేషన్లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం బ్రహ్మయ్య ఎస్ఐగా పదోన్నతి పొందారు. గుంటూరు ఎస్పీకి గురువారం రిపోర్ట్ చేశారు. సమర్థవంతంగా ఏఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన బ్రహ్మయ్య ఎస్ఐగా పదోన్నతి పొందడం పట్ల మండలంలోని అధికారులు, సిబ్బంది స్థానిక ప్రజలు, ఎస్ఐ వై సురేష్, సిబ్బంది బ్రహ్మయ్యను అభినందించారు.

టిడిపి నాయకులు బెల్లంకొండ మృతి

ప్రజాశక్తి - పంగులూరు



బెల్లంకొండ దశరథ (ఫైల్)

మండలంలోని చందలూరు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు, తెలుగు దేశం నాయకులు బెల్లంకొండ దశరథ (67) బుధవారం మరణించారు. ఆయన స్వగ్రామమైన చందలూరులో గురువారం ఉదయం అంత్యక్రియలు జరిగాయి. ఆయనకు ఇటీవల గుండె ఆపరేషన్ చేశారు. అప్పటి నుండి ఆయన ఆరోగ్య పరంగా కొంత బలహీన పడుతూ వచ్చారు. రాయవెల్లూరులోని ఆసుపత్రిలో గత కొన్ని రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. బుధవారం వెంటిలేటరు తీయడంతో ప్రాణాలు విడిచారు. దశరథ రాజకీయ జీవితం ప్రారంభంలో అద్దంకి నియోజకవర్గం కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేశారు. తరువాత చందలూరు పిఎసిఎస్ అధ్యక్షులుగా పనిచేశారు. మాజీ శాసన సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తికి అనుచరునిగా కొంతకాలం కొనసాగారు. తరువాత తెలుగుదేశం నాయకుడిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. దశరథకు భార్య అమ్మన్నీ, కుమార్తె ఉన్నారు. కుమార్తె అమెరికాలో ఉంటున్నారు. దశరథ మృతదేహాన్ని పలువురు తెలుగుదేశం నాయకులు సందర్శించి నివాళులర్పించారు.



మొక్కలు నాటుతున్న సమగ్ర శిక్ష అధికారి ఎంవి సుధాకర్

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎంవి సుధాకర్ మునిసిపల్ హై స్కూల్ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులు, దాని వలన కలిగే నష్టాలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. అడవులు, చెట్లు తగ్గిపోవడం వల్లనే గ్లోబల్ వార్మింగ్ పెరిగి పోతుందని అన్నారు. స్వచ్ఛమైన గాలి వాతావరణం కోసం మొక్కలు పెంచాలని సూచించారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా చెట్లు ప్రధానమని చెప్పారు. చెట్లు పెంచడం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులను చైతన్యం చేయాలని చెప్పారు. విద్యార్థుల ద్వారా ప్రోత్సహిస్తే ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్ నిరంజన్, డి ప్రసాదరావు, పాఠశాల హెచ్ఎం బి రాజశ్రీ, పిడి కె శ్రీనివాసరావు, పీఈటీ రవికుమార్, అడే బుజ్జి, ఎంఎల్ బి మోజెస్, ఎస్ఓ శ్రీనివాసరావు, సిఆర్‌పి టి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

వాడుక నీరు లేక సిబ్బంది అవస్థలు

మండల పరిషత్ కార్యాలయంలో దుస్థితి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రూ.లక్షల నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేసినప్పటికీ అవి కాస్త పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోవడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వాడుక నీరు లేక అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నికల ముందు మండల పరిషత్ కార్యాలయానికి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.14లక్షల నిధులు వెచ్చించి పనులు చేశారు. ఆ నిధులతో పనులు పూర్తి స్థాయిలో కాంట్రాక్టర్ చేయకపోవడంతో కార్యాలయంలో సమస్యలు అలాగే మిగిలి పోయాయి. ఈ నిధులతో చేపట్టాల్సిన మరుగుదొడ్ల నిర్మాణం, కార్యాలయం చుట్టూ నిలబడే వర్షపు నీరు బయటకు వెళ్ళేందుకు తగిన ఏర్పాట్లు, నూతన మోటారు బిగించి కార్యాలయ సిబ్బందికి అవసరమైన నీటి వినియోగానికి ట్యాంకు నిర్మాణం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అవసరమైన ఈ పనులు చేయకుండానే కార్యాలయానికి రంగులు మాత్రమే వేసి టైల్స్ నిర్మాణం చేపట్టి కాంట్రాక్టర్ రు.12లక్షలపైగా నిధులు బిల్లులు చేయించుకున్నారు. దీని కారణంగా ప్రస్తుతం కార్యాలయంలో ఏర్పాటు చేయాల్సిన మోటారు పాడైపోయి ట్యాంకుకు నీళ్ల వెళ్లే మార్గం లేక సిబ్బంది బకెట్లతో నీటిని నింపుకొని అధికారుల మరుగుదొడ్లలో నింపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే



తాళాలు వేసి ఉన్న మండల పరిషత్ కార్యాలయం గదులు

ప్రజలకు మరుగుదొడ్ల నిర్మాణం అందుబాటులో లేవు. ఉన్న దొడ్లు పాడైపోయాయి. నీటి వసతి లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. మండల పరిషత్ తాసిల్దార్, మండల సమైక్య కార్యాలయం ఒకే ప్రాంగణంలో ఉండటంతో ఈ కార్యాలయాలకు నిత్యం ప్రజలు, మహిళలు వివిధ పనులపై వస్తూ ఉంటారు. వీరందరికీ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న మరుగుదొడ్డి మాత్రమే ఆధారం. మండల సమైక్య కార్యాలయానికి నిత్యం మహిళలు డ్వాక్రా రుణాలు, ఇతర లావాదేవీల కొరకు వస్తూ ఉంటారు. వీటితోపాటు యానిమేటర్లు, ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న మహిళా ఫీల్డ్ అసిస్టెంట్లుకు మరుగుదొడ్ల వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు.

నీటి వసతి లేక అధికారులు దుమ్మా

మండల పరిషత్తు కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కార్యాలయ ఆవరణలో మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో విధులకు కూడా రావడానికి జంకుతున్నారు. దీని కారణంగా కార్యాలయాలు ఒకటి, రెండు మినహా మొత్తం గైర్హాజరుతో తాళాలు వేసి ఉంటున్నాయి. నిన్న మొన్నటి వరకు ఎన్నికల నిబంధనలు అమల్లో ఉండటంతో మండల పరిషత్ నిధులతో మరుగుదొడ్లకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి అవకాశం లేకుండా పోయిందని, ఎన్నికల నిబంధనలు ఎత్తివేసిన అనంతరం కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారుల ఇబ్బందుల దృష్ట్యా తక్షణమే మండల పరిషత్తు నిధులతో అవసరమైన మరుగుదొడ్ల నిర్మాణం, దానికి అనుసంధానమైన నీటి వసతికి తగిన చర్యలు చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు. నూతన మోటార్ నిర్మాణం చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు, కార్యాలయ సిబ్బంది కోరుచున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ కార్యాలయంలో మరుగుదొడ్ల వినియోగంలోకి తీసుకువచ్చి నూతన మోటార్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని అన్నారు.



తుప్పు పట్టి పాడైన విద్యుత్ మోటారు

'భూ హక్కు చట్టం' రద్దు పట్ల హర్షం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజా విరుద్ధమైన భూ యాజమాన్య హక్కు 2023 చట్టాన్ని రద్దు చేస్తూ సంబంధిత దస్త్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం పెట్టడం పట్ల బార్ అసోసియేషన్ సభ్యులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అసోసియేషన్ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్య ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం తెచ్చిన భూ యాజమాన్య హక్కు 2023 చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ 100 రోజులు పాటు తాము వివిధ రూపాల్లో నిరసనలు, ఉద్యమాలు, ధర్నాలు చేసినట్టు తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక తక్షణమే రద్దు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని అన్నారు. హామీని నెరవేరుస్తూ ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన తొలి రోజే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్



అంబేద్కర్ సర్కిల్ వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

రద్దు చేస్తూ సంతకం చేయడం పట్ల న్యాయవాదులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీమా లీలా కృష్ణ, జిఎస్ నాగమోహిని, కత్తి నాగలక్ష్మి, బండి రామ్మూర్తి, ఐ బాలకృష్ణ, విన్నకోట సతీష్, లంబు సాంబయ్య, కట్టా కోర్నేలు, క్రోసూరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చీరాల : లాండ్ టైటిల్ యాక్టు రద్దు చేయడం పట్ల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జాతీయ సహాయ కార్యదర్శి బూదరాజు శశికిరణ్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు న్యాయవాదులు, రాష్ట్ర ప్రజానీకానికి ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రెండో సంతకం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక, చీకటి చట్టం నుండి రాష్ట్ర ప్రజలను కాపాడారని అన్నారు. ఈ చట్టం రద్దు చేయడం ప్రజాపాలనకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. యాక్టు రద్దు చేయడం ద్వారా ఎంతోమంది పేదలు, రైతులకు న్యాయం చేకూరుతుందని అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకుని రావడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

బాపట్ల పట్టణ అభివృద్ధికి సహకరించండి

◆ కష్టంగా ఉంటే వెళ్ళిపోండి ◆ మున్సిపల్ అధికారుల సమీక్షలో నరేంద్ర వర్మ

ప్రజాశక్తి - బాపట్ల

అభివృద్ధిలో ఆదర్శవంతంగా అందమైన పట్టణంగా అభివృద్ధిచేసే క్రమంలో మున్సిపల్ సిబ్బంది సంపూర్ణ సహకారం అవసరమని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో కమిషనర్ శ్రీకాంత్ అధ్యక్షతన అధికారుల సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో ఎంఎల్ఎ నరేంద్రవర్మ మాట్లాడుతూ పట్టణాన్ని ప్రగతి దిశగా నడిపించే జవాబు దారితనంతో కూడిన పరిపాలన అందించాలని చెప్పారు. బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన విషయాన్ని అధికారులు విస్మరించ కూడదని అన్నారు. ఏ ఒక్కరిపై రాజకీయ ఒత్తిడి తేవాలన్నది తమ అభిమతం కాదని అన్నారు. ఇష్టమైతే ఇక్కడ పనిచేయండి కష్టమైతే వెళ్ళిపోవచ్చని సూచించారు. మున్సిపల్ సిబ్బందిని, అధికారులను సున్నితంగా మందలిస్తూనే పరోక్షంగా హెచ్చరించారు. పురపాలక సంఘం ఎలా ఉందో తనకు తెలుసని అన్నారు. గతంలో ఎలా ఉందో కూడా తన దగ్గర ఆధారాలు ఉన్నాయని అన్నారు. అప్పటి పరిస్థితులు పునరావృత్తం కావటానికి వీల్లేదని అన్నారు. చెత్త, చెదారం, పైపులైన్ల లీకేజీతో మంచినీళ్ళల్లో కలిసే మురుగునీరు, వెలగని వీధి దీపాలు, ఉక్కిరి బిక్కిరి చేస్తున్న దోమలు, కొంత మంది అధికారుల్లో కనిపించే అలసత్వం పురపాలక సంఘం అభివృద్ధికి అవరోధంగా మారిందని అన్నారు. ఈ పరిస్థితి తక్షణం మారాలని సూచించారు. ప్రతిక్షణం పట్టణ అభివృద్ధికి పనిచేసే విధంగా సహకరించాలని కోరారు. ఏ ఒక్కరినీ ఇబ్బందులకు గురి చేసే పద్ధతులు తమ ప్రభుత్వంలో ఉండవని పేర్కొన్నారు. చేసే పనిలో నిబద్ధత, సమర్ధత, బాధ్యతతో పనిచేయాలని అన్నారు. గత ప్రభుత్వం సంగతి ఇప్పుడు అవసరం లేదని అన్నారు. తమ ప్రభుత్వంలో ఏం చేయాలి, ఎలా చేయాలి, పట్టణ అభివృద్ధికి ఏ విధంగా సహకరించాలనే లక్ష్యంతోనే అధికారులు పనిచేయాలని అన్నారు. అందరూ కలసికట్టుగా పని చేసి పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దుకుందామని అన్నారు. ఈపాటికే కొంతమంది అధికారుల పనితీరు ఇబ్బందికరంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రవర్మ



మంత్రులను కలిసిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

అమాత్యులకు ఎమ్మెల్యే నరేంద్రవర్మ సత్కారం

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర మంత్రి వర్గంలో జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన అద్దంకి ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్, రేపల్లె ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ బుధవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ జిల్లా నుండి తమ సహచర శాసన సభ్యులకు క్యాబినెట్ పదవి దక్కడం అభినందనీయమని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి రాష్ట మంత్రులుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఉన్నారు.



ట్రై సైకిల్, తోపుడుబండ్లు అందచేస్తున్న ఎంఎల్ఎ నరేంద్రవర్మ

ట్రై సైకిల్, తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి - కర్లపలెం

మండలంలోని పేరలి గ్రామంలో డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిరుపేదలకు ట్రై సైకిల్, తోపుడు బండ్లు ఎంఎల్ఎ వేగేశన నరేంధ్రవర్మ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంధ్రవర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిజాయతిగా పనిచేసినప్పుడే గెలుపు మన సొంతం అవుతుందని అన్నారు. ఈ గెలుపు ప్రతి ఒక్కరిదని అన్నారు. ఈ అధికారం మీరు ఇచ్చినదేనని, తానెప్పుడు సేవకుడిలా పనిచేస్తానని అన్నారు. ప్యార్లి గ్రామానికి చెందిన దొబ్బకూటి సోవమ్మ, దోమతోటి సామ్రాజ్యంకు ట్రై సైకిల్, తోపుడు బండి అందజేశారు. బహుకరించిన డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తిని అభినందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థికి రోటరీ నగదు బహుమతి

ప్రజాశక్తి - చీరాల

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ సామాజిక భవనంలో గురువారం ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ 1992 పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో ఎన్ఆర్ అండ్ పిఎం 2023 - 24 సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో 550 అత్యధిక మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థి మానేపల్లి జానకి రామాచారికి రూ.11,116 నగదు బహుమతి అందజేశారు. ఘనంగా శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛాలు, స్వీట్ బాక్స్ అందజేసి జ్ఞాపికను బహుకరించారు. హాజరైన వారందరికీ అల్పాహారం ఏర్పాటు చేశారు. గత తొమ్మిదేళ్లుగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం ఇస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని అన్నారు. పాఠశాల్లో చదివిన ఎందరో మహానుభావులు ఉన్నతమైన పదవుల్లో వున్నారని డివి సురేష్ తెలిపారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్, బి హేమంత్ కుమార్, డాక్టర్ గురునాధం, షేక్ బషీర్, యక్కల చంద్రశేఖర్, గోలి మురళీ, జివై ప్రసాద్, తిరుపతిరావు, పూర్ణచంద్రరావు, గురుప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థిని సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు



మైనేని మురళీకృష్ణను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

మైనేనికి ఘన సన్మానం

ప్రజాశక్తి - కొల్లూరు

సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి విజయభేరి మోగించడంతోపాటు మండలంలో అత్యధిక మెజార్టీ తీసుకొచ్చిన టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణను మండలంలోని పోతర్లంక, తిప్పలకట్ట గ్రామస్తులు గురువారం ఆయన గృహం నందు మురళీకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల వేసి శాలువా కప్పి సత్కరించారు. సత్కరించిన వారిలో తెలుగుదేశం నాయకులు మద్దూరి సుబ్బారావు, పెద్దపల్లి రాంబాబు, మద్దూరి అజయ్ చక్రవర్తి, బూసి సుధాకర్, చొప్పర భాస్కర్, చొప్పర సరోజిని పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన కలిగి ఉండాలి

సహాయ వ్యవసాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్

ప్రజాశక్తి - రేపల్లె

రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి జీవన ఎరువులు (పీఎస్బీ) వాడాలని వ్యవసాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ అన్నారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువు ఉపయోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడటంతో రైతులు పనుల్లో నిమగ్నం అయ్యారని తెలిపారు. ఎక్కువ దిగుబడులు సాధించాలనే ఉద్దేశ్యంతో చాలా మంది రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు ఉపయోగి స్తున్నారని అన్నారు. దీంతో భూసారం దెబ్బతిని భూమి తన సహజ స్థితిని కోల్పోతుందని అన్నారు. ఒక ఎకరానికి సరిపడా జీవన ఎరువును 100కిలోల పశువుల ఎరువుతోపాటు రెండు కిలోల జీవన ఎరువు ఫోస్ఫో బ్యాక్టీరియా కలిపి తయారు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతులు భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలని చెప్పారు. దీంతో పోషకాల సమతౌల్యం పెరిగి ఖర్చు తగ్గు తుందని రైతులకు సూచించారు. వరి సాగు ఖర్చు తగ్గించుకునేందుకు వెదజల్లే పద్ధతిలో విత్తనాలు వేయాలన్నారు.



ఎడిఎ సయ్యద్ అక్తర్ హుస్సేన్



పవన్‌కల్యాణ్‌ను సత్కరిస్తున్న అనిల్

పవన్ కళ్యాణ్‌కు అనిల్ సత్కారం

ప్రజాశక్తి - పర్చూరు

జనసేన అధినేత, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పర్చూరు నియోజకవర్గానికి చెందిన జనసేన కేంద్ర ఎన్నికల కమిటీ కన్వీనర్ అనిల్ కుమార్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూరు శాతం విజయోత్సవం సాధించడమే కాకుండా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచిన పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఆంధ్ర రాష్ట్రానికి కూటమి రూపంలో మంచి రోజులు వచ్చాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పనపై దృష్టిపెట్టాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని విత్తన దుకాణాలపై మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెవి శ్రీనివాసరావు, ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎడిఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా బిల్లు తీసుకోవాలని చెప్పారు. బిల్లులో విత్తన రకం, కంపెనీ పేరు, లాట్ నంబర్ ఉండేటట్లు చూసుకోవాలని అన్నారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



విత్తన దుకాణాలపై తనిఖీలు చేస్తున్న అధికారులు

ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు రాజీనామా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎపి ఈడిగ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని తాతవారి పాలెంకు చెందిన పడమట శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటివరకు తన పదవిని కొనసాగించేందుకు గాను సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈడిగ కార్పొరేషన్ ద్వారా ఇప్పటి వరకు ప్రజలకు తన వంతు సహాయ సహకారాల అందించానని పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటరీకి పంపించినట్లు తెలిపారు.



కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే కేసులు

పాఠశాలల యాజమాన్యాలకు డిటిసి ఆర్.సుశీల సూచన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే కేసులు నమోదు చేస్తామని ఉప రవాణా కమిషనర్ ఆర్. సుశీల హెచ్చరించారు. జిల్లాలోని పాఠశాలు, కళాశాలల బస్సులకు ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు వెంటనే చెల్లించాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ట్యాక్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. ఫిట్‌నెస్, ఇతర సర్టిఫికెట్లు లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే సమీపంలోని రవాణా కార్యాలయంలో దరఖాస్తు చేసి పొందాలన్నారు. డ్రైవర్ స్కూలు, కళాశాల బస్సు నడుపుతున్నప్పుడు అతివేగం పనికిరాదని, తాగి వాహనాన్ని నడపారని కోరారు. రహదారి నియమ నిబంధనలు తప్పక పాటించి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దటానికి సహకారాలు అందించాలని యాజమాన్యాలను కోరారు.

ఎమ్మెల్యే కొండయ్య ఘన సత్కారం

ప్రజాశక్తి-చీరాల



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

చీరాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తెలుగుదేశం పార్టీ లో ఎమ్మెల్యే గా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన కొండయ్యను వాడరేవు టిడిపి నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు.గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో పిన్ని బోయిన రామకృష్ణ , డాక్టర్ సైకం చంద్ర ఆధ్వర్యంలో వాడురేవు కీర్తివారిపాలెం గ్రామస్తులు మద్దులూరి మాలకొండయ్య ను మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మంత్రి స్వామిని కలిసిన హరినాథ్

ప్రజాశక్తి-ఒంగోలు



మంత్రి స్వామితో హరినాథ్

రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని విజన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ రామాల హరినాథ్ చౌదరి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి.. పుష్పగుచ్ఛం అందజేశారు.

తల్లులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



తల్లికి చీర అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్ సంధ్య

ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో ఆడపిల్లలను కన్న 16 మంది తల్లులకు దాత తూము రమణారెడ్డి సహకారంతో అందించిన చీరలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య గురువారం పంపిణీ చేశారు. రమణారెడ్డి తల్లిదండ్రుల సమక్షంలో ఈ చీరలను అందజేశారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

సమిష్టికృషితో ఎన్నికలు విజయవంతం

- కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ - అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



డిఆర్ఒను సత్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సమిష్టి కృషితోనే జిల్లాలో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆర్ఒలు, వివిధ అంశాలకు సంబంధించిన నోడల్ ఆఫీసర్లు, ఏఆర్ఒలు, ఇతర శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో గురువారం కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్స్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పకడ్బందీ ప్రణాళిక రూపకల్పన, దాని అమలును నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. జిల్లాస్థాయి మొదలుకొని గ్రామ స్థాయి వరకు అధికారులకు, సిబ్బందికి ఈ దిశగా శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ద్వారా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికల ప్రక్రియ ముగిసిందన్నారు. పోలింగ్ శాతంలో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ విధుల్లో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి ఆయన ప్రసంశాపత్రాలు అందజేశారు. ఎస్‌పి గరుణ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయడంతో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలుగలేదన్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి అధికారులందరూ కలెక్టర్, ఎస్‌పిని సన్మానించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, అధికారులు పాల్గొన్నారు.

బక్రీద్ సందర్భంగా

సామూహిక వధ చట్ట విరుద్ధం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బక్రీద్ పర్వదినం సందర్భంగా సామూహిక వధ చట్ట విరుద్ధమని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆవులు, లేగ దూడల సామూహిక వధ జరిగే అవకాశం ఉండటంతో అటువంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. ఆవులు, లేగ దూడలను వధించటం జంతు హింస నివారణ చట్టం 1960, ఆంధ్ర ప్రదేశ్ గోవధ నిరోధక చట్టం 1977, పశువుల రవాణా నియమావళి 1978 సుప్రీం కోర్టు, హై కోర్టు వివిధ ఉత్తర్వుల ప్రకారం చట్ట విరుద్ధమన్నారు. జిల్లాలో ఈలాంటి చర్యలకు ఉపక్రమించినా, సహకరించిన వారందరు చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. ఈ విషయాన్ని దష్టిలో ఉంచుకుని ఎవరు సాముహిక వధ కోసం వారి పశువులను అమ్మవద్దని, వాటి రవాణాలో పాలు పంచుకోవద్దని వధించరాదని సూచించారు. కలెక్టర్ ఈ విషయమై పోలీస్ శాఖ, రవాణా శాఖ, పురపాలక శాఖ, పంచాయతీరాజ్, పశు సంవర్ధక శాఖలకు ఆదేశాలు ఇచ్చారని, ఎవరైన జంతు హింసకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ప్రజలందరు ఇటువంటి చర్యలకు దూరంగా ఉండి ఈ అమానవీయ జంతు హింసను నివారించాలని ఆమె కోరారు.

జంతువులను వధిస్తే చర్యలు

బాపట్ల జిల్లా: బక్రీద్ సందర్భంగా ఈ నెల 17 న జంతువులను వధించినా లేక అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ యం.హనుమంతరావు హెచ్చరించారు. జంతు సంరక్షణ కేంద్రాలను జిల్లా, గ్రామ పంచాయతి స్థాయిలో ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆదేశాల మేరకు జిల్లా నోడల్ అధికారులుగా డాక్టర్ ఏ.రమేష్ బాబు,చీరాల ఉప సంచాలకులు పశుసంవర్ధక శాఖ. డాక్టర్ వై.పద్మావతి బాపట్ల ఉప సంచాలకులను నియమించడం జరిగిందన్నారు. గోవధ, జంతు సంరక్షణ చట్టం - 1977, జంతు రవాణా నియమావళి 1978, 2001 స్లాటర్ హౌస్ రూల్స్ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. బక్రీద్ రోజున జంతు సంరక్షణ చట్టాలు తప్పక పాటించాలని, అతిక్రమించిన వారిపై పోలీసు మరియు రెవిన్యూ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

వైకల్యమే ఓడింది..

- పారా వాలీబాల్ పోటీలో అంతర్జాతీయ స్థాయిలో నాగరాజు ప్రతిభ
- చైనాలో జరిగిన బీచ్ పారా వాలీబాల్ అంతర్జాతీయ పోటీల్లో రజత పతకం కైవశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



పతకాలతో పిచ్చుక నాగరాజు

చిన్నప్పుడే ఒక చేతిని కోల్పోయినా అధైర్యపడలేదు.. క్రీడలంటే ఇష్టమున్న నాగరాజు బాక్సింగ్ క్రీడాకారుడు అయినా తన తాత ప్రోత్సాహంతో వాలీబాల్ ఆటలో ప్రావీణ్యం సంపాదించాడు. ఒకప్పుడు 'నువ్వేమి ఆడతావ్' అన్న వారితోనే 'శభాష్' అనిపించుకున్నాడు. సకలాంగులుగా ఉన్న వారితో పోటీ పడి ఆడుతూ వాలీబాల్ క్రీడలో మేటి జట్లతో ఆడుతూ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు.

జిల్లాలోని వేటపాలెం మండలం పందిళ్ల పల్లిలోని చేనేత కుటుంబానికి చెందిన పిచ్చుక కోటసుబ్బారావు, పరమేశ్వరి దంపతుల చిన్న కుమారుడు అయిన పిచ్చుక నాగరాజు ఏడేళ్ల ప్రాయంలో జరిగిన ప్రమాదంలో కుడిచేయి మణికట్టు పైవరకు కోల్పోయాడు. ఆటలంటే చిన్నప్పటి నుంచి ఇష్టమున్న నాగరాజు ప్రమాదం నుంచి కోలుకున్నాక తోటి వారితో పలు రకాల అటల్లో పాల్గొంటూ వచ్చాడు. సముద్రతీర ప్రాంతం అయిన వేటపాలెం, పందిళ్ళపల్లి, చినగంజాంలలో ఎక్కువమంది యువకులు ఇక్కడ ఉంటే ఇసుకలో వాలీబాల్, కబడ్డీ ఆటలు ఆడుతుంటారు. తన తాత నాగరాజు ప్రోత్సాహంతో ఒంటి చేత్తోనే వాలీబాల్ ఆడటం ప్రారంభించిన నాగరాజు సడలని ఆత్మవిశ్వాసంతో వాలీబాల్ ఆటలో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. రాష్ట్రంలోనూ, ఇతర ప్రాంతాలలోనూ ఎక్కడ పోటీలు జరిగినా వాటిలో పాల్గొంటూ తన ప్రతిభతో పతకాలు సాధిస్తూ వచ్చాడు. జాతీయ స్థాయిలో బెంగళూరు, హరియాణా, తమిళ నాడు, కంబోడియా, జర్మనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పారా వాలీబాల్ పోటీలకు హాజరై తన ప్రతిభను కనబరిచారు. గత నెలలో తమిళనాడులోని నాగపట్నం బీచ్‌లో జరిగిన పారా వాలీబాల్ ప్రపంచ స్థాయి పోటీలలో నాగరాజు పాల్గొని జాతీయ జట్టుకు ఎంపిక య్యారు. పారా వాలీబాల్ ఆటలో నైపుణ్యం ప్రదర్శించి చైనాలో మే నెల 30 నుంచి జూన్ 2 వరకు జరిగిన ప్రపంచ పారా బీచ్ వాలీబాల్ పోటీలకు అర్హత సాధించారు. చైనా వెళ్లడానికి ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే ఉన్న నాగరాజు దాతల సాయాన్ని కోరారు. నాగరాజుకు స్థానిక దేవాంగ నేతలు, సేవాసంస్థల వారు ఆర్థిక చేయూతనిచ్చారు. ఈ మేరకు చైనాలో జరిగిన ప్రపంచ పారా బీచ్ వాలీబాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన నాగరాజు సమిష్టి కృషితో రెండో స్థానంలో నిలిచి రజిత పతకాన్ని కైవసం చేసుకున్నారు. నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం తాను హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ అకాడమీలో వాలీబాల్ శిక్షకునిగా పనిచేస్తున్నానని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయంగా మరిన్ని వాలీబాల్ పోటీల్లో పాల్గొంటూ మరింతగా శిక్షణ పొంది రానున్న ఒలింపిక్స్ లో ఆడాలనేది తన లక్ష్యమని నాగరాజు చెప్పారు.